
- ఒప్పంద కాలం పూర్తయినా పట్టించుకోని ప్రభుత్వం
- ఏజెన్సీ ద్వారానే వేతనాల చెల్లింపు
- జీతాలు సైతం తక్కువేనని ఆవేదన



ఓపీఎస్‌ల క్రమబద్ధీకరణ ఎప్పుడు?

కాగజ్‌నగర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ జూనియర్ పం చాయతీ కార్యదర్శు(ఓపీఎస్)ల పరిస్థితి ద యనీయంగా ఉంది. 2018లో జేపీఎస్ పరీక్ష ద్వారా 9,355 పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం కార్యద ర్శుల పోస్టులకు పరీక్ష నిర్వహించి ఎంపిక చేసింది. ఇం దులో సుమారు మూడు వేల మందికి ఇతర ఉద్యోగాలు రావడంతో ఆ ఖాళీల్లో తర్వాత స్థానా ల్లో ఉన్న 2వేల మందిని 2019లో ఔట్ సోర్సింగ్ ద్వారా నియామాకాలను చేసింది. ఈ నియా మాకాల్లో క్రమబద్ధీకరణ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకు ఒప్పందాలు జరిగాయి. ఇక్కడి వరకు బాగానే ఉన్నప్పటికీ ప్రభుత్వ కొలువు దొరుకుతుం దన్న ఆశతో ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శు లుగా విధుల్లో చేరారు. నాలుగేళ్ల ఒప్పంద కాలం పూర్తి అయినప్పటికీ కూడా ఇంత వరకు వీరిని క్రమబ ద్ధీకరించడం లేదు. దీంతో తమ భవిష్యత్తు ఎంటన్నీ అంశం వీరిలో ఇప్పుడు ఆందోళన రేకెత్తు తోంది. ప్రభుత్వం ఉద్యోగం వచ్చిందన్న సంతో షమూ లేదు, క్రమబద్ధీకరణ కాక ఇంకా ఇబ్బం దులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. తమకు ఉద్యోగ భద్రత లేక చాలా కష్టాలు పడుతున్నా మని పలువురు ఆవేదన చెందుతున్నారు. క్రమబ ద్ధీకరణ కాక పోవడంతో ఇంక్రిమెంట్లు రాక పూర్తిగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కుమరం భీం జిల్లాలో..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఔట్ సోర్సిం గ్ విధానంపై 54 మంది విధులు నిర్వహిస్తున్నా రు. ప్రభుత్వం వీరిని క్రమబద్ధీకరించక పోవడంతో ఆందోళన చెందు తున్నారు. తాము రాత పరీక్ష ద్వారా ఎంపికైనప్పటికీ కూడా తమకు అన్యాయం జరుగుతోందని, తమకు వెంటనే న్యాయం చేయా లని సంబంధిత మంత్రులకు కూడా వినతి పత్రా లిచ్చినప్పటికీ కూడా ఇంత వరకు పురోగ తి లేక ఇబ్బందులు పడాల్సిన దైన్య స్థితి ఏర్పడిందని అంతా వాపోతున్నారు. ఓపీ ఎస్‌లకు అరకొర వేతనాలే దిక్కయ్యాయి. రూ.18,231 వేతనంగా నిర్ధారించారు. ఇందులో ఏజెన్సీ కమిషన్, ఈపీ ఎఫ్, జీఎస్టీ, సర్వీస్ పోను నెలకు రూ.10,600 నుంచి రూ.15000 వరకు మాత్రమే వస్తు న్నాయని వారు చెబుతున్నారు. ఒక్కో జిల్లాకు ఒక్కొక్క తీరుగా వేతనాలు వస్తు న్నాయని ఔట్ సోర్సింగ్ జూనియర్ పంచాయతీ సెక్రటరీలు వాపోతున్నారు. కొన్ని జిల్లాలో మూడు నుంచి నాలుగు నెలల వరకు జీతాలు ఇంత వరకు రావడం లేదని పలువురు ఓపీఎస్ తెలి పారు. తమతో పాటు రిక్రూట్ అయని రెగ్యూలర్ అయిన పంచాయతీ కార్యదర్శు లకు రూ.28వేల వేతనం వస్తోందని, తమకు మాత్ర సగం జీతం వస్తోందని, విధులు మాత్రం సమా నంగా నిర్వహిస్తు న్నామని, ఇంత అన్యాయం జరుగడం చాలా దారుణమని చెబుతున్నారు. గత నెలలో కూడా పంచాయతీ రాజ్ మంత్రి సీతక్కను కూడా కలిసి విన్నవించారు.

సర్కార్‌కు పట్టింపు కరువు..

ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న పంచా యతీ కార్యదర్శులు(ఓపీఎస్‌లు) భవిష్యత్‌ను ప్రభుత్వం ప్రశ్నార్థకంలో పడేసింది. వీరి వి షయంలో తన వైఖరి స్పష్టం చేయడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో తీసుకెళ్ల తున్నప్పటికీ కూడా వీరి క్రమబద్ధీకరణ విషయం ఇంకా తేలక పోవడంతో భవిషత్తు ఏంటని ఔట్ సోర్సింగ్ జూనియర్ పంచాయతీ సెక్రటరీల్లో ఆందోళన నెలకొన్నది. ప్రస్తుతం జీపీఎస్‌ల పని తీరు ఆధారంగా రెగ్యూలరైజ్ చేస్తున్న రాష్ట్ర ప్రభు త్వం వీరి విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకో వడం లేదు. ప్రస్తుతం రెగ్యూలర్‌గా పని చేస్తున్న జీపీఎస్‌ల్లో 90 శాతం రెగ్యూలర్ నియామాకాలు కుమరం భీం జిల్లాలో పూర్తి చేశారు. ఓపీఎస్‌లు గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనం, హరితహారం, మొక్కల పెంపకం, నర్సరీల నిర్వహణ, ఉపాధి హామీ పనుల కల్పన, పన్నుల విధింపు, గ్రామ సభలు, సమావేశాల నిర్వహణ, ప్రభుత్వ పథ కాల అమలు, లబ్ధిదారుల గుర్తింపు, పంచాయతీ రికార్డుల నిర్వహణ, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, ఇంటింటా సేకరించిన తడి, పొడి చెత్తను సెగ్రిగేషన్ షెడ్లు, డంప్ యార్డులకు తరలింపు వంటి పనులు రెగ్యూలర్ పంచాయతీ కార్యదర్శులతో సమా నంగా విధులు నిర్వహిస్తు న్నారు. కానీ వీరి జీతాలు సమస్య, ఉద్యో గ భద్రత విషయంలో ఇంత వరకు ఎలాంటి అడు గులు పడక పోవడంతో భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల ను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆసిఫాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన వల్ల నష్ట పోయిన రైతులను ఆదువాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానికంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ తుఫాన్ వల్ల వర్షాలతో కోత దశలో వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల వర్షంతో పాటు గాలుల తీవ్రతకు వరి నేల వాలిందని చెప్పారు. కోతకు వచ్చిన సమయంలో వరి నేలవాలడంతో గింజలు కుళ్లిపోతా యని చెప్పారు. జిల్లాలో అధికంగా పత్తిని సాగు చేస్తున్నారని అన్నారు. వర్షాలకు పత్తి మొక్కలు కుళ్లిపోతున్నాయని అన్నారు. పత్తి ఏరే సమయంలో కురిసిన వర్షాలకు పంట నల్లబారుతుందని చెప్పారు. దీంతో రైతులకు ధర లభించక అవస్థలు పడుతారని అన్నా రు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవా లని కోరారు. కార్యక్ర మంలో నాయకులు దివాకర్, కార్తీక్, రాజేందర్, టికానంద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికి రూ.12 వేల మద్దతు ధర ప్రకటించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు ఆనంద్‌రావు

కెరమెరి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పత్తి రైతుల పరిస్థితి దారుణంగా మారిందని క్వింటాలకు రూ.12 వేల మద్దతు ధర ప్రకటించాలని సీఐటీయూ నాయకుడు ఆనంద్‌రావు డిమాండ్ చేశారు. స్థానికంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అతివృష్టి కారణంగా పత్తి పంట పూర్తిగా నష్ట పోవాల్సి వస్తుందని చెప్పారు. ప్రభుత్వం స్పందించి రూ12 వేల మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయ కులు శంకర్, నాందేవ్, అక్తర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

పెంచికలపేట, అక్టోబరు 31 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని మొర్లిగూడ, జిల్లెడ గ్రామానికి చెందిన పోర్తెటి సాగర్‌కు రూ.28500 సీఎంఆర్ఎఫ్ చెక్కు ను శుక్రవారం బీజేపీ నాయకులు అంద జేశారు. ఈ సందర్భంగా పలువురు మా ట్లాడుతూ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆదేశాల మేరకు బాధిత కు టుంబానికి చెక్కు అందజేసినట్లు తెలి పారు. కార్యక్రమంలో నాయకులు రాజే ష్, మధుకర్, నాగన్న, ప్రభాకర్, చంద్రశే ఖర్, శంకర్, పురుషోత్తం, బాపూజీ, శోభన్, టి.రాజన్న, ప్రభాకర్, శివరాం, లహంచు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక

సిర్పూర్(టి), అక్టోబరు 31 (ఆంధ్రజ్యో తి): సిర్పూర్(టి) సాంఘిక సంక్షేమ గు రుకుల పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు జాతీయ స్థాయి సాఫ్ట్ బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శారద తెలిపారు. ఇటీవల జగిత్యాల జిల్లా కోరుట్లలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభకనబర్చి ఈ నెల 7 నుం చి 9 వరకు మహారాష్ట్రలోని షిర్డిలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు పాఠశాలకు చెందిన విద్యార్థినులు అలేఖ్య, కీర్తన, శివాని, పూజ, సంజనలు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ జ్ఞానేశ్వరిలు విద్యార్థినులను అభినందించారు. జాతీయ స్థాయి పోటీ ల్లో రాణించాలని సూచించారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ సంకల్పాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

ఆసిఫాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశ సమగ్రత, ఐక్యతకు కృషి చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆలోచనలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో భాగంగా 2కే రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు, భారత దేశ మొదటి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ భారత ఏకీకతకు ప్రతీక అని చెప్పారు. ఆయన కృషి వల్లే మన దేశం ఐక్యంగా నిలిచిందని అన్నారు.. అంతకు ముందు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి కేబీ చౌక్ మీదుగా రెండు కిలో మీటర్ల దూరం వరకు పరుగు పందెం నిర్వహించగా జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐ బాలాజీ వరప్రసాద్, రాణా ప్రతాప్, ఆర్ఐ పెద్దన్న, ఆర్ఐ విద్యాసాగర్, ఆర్ఎస్ఐలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ పార్టీ కార్యాలయంలో సర్దార్‌వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, సీనియర్ నాయకు డు అరిగెల నాగేశ్వర్రావు, మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్‌లు వల్లభాయ్ పటేల్ చిత్రపటా నికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, సుజిత్, జయరాజ్, వెంకన్న, పోశన్న, ప్రసాద్‌గౌడ్, మురళీగౌడ్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు నిర్వహించారు.ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు సర్దార్‌వల్లభాయ్ పటేల్ చిత్రప టానికి పూలమాల వేసి నివాళులు అర్పిం చారు. కార్యక్రమంలో విజయ్, దుర్గం మో తీరాం, రంగన్న, మధుకర్ పాల్గొన్నారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండలం లో పోలీసుల అధ్వర్యంలో యూనిట్ రన్ కా ర్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జై నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుద్మేత విశ్వ నాథ్‌రావు, ఎస్సై రామకృష్ణ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎస్సై వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు 2కే రన్ నిర్వహించారు. పోలీసు స్టేషన్ నుంచి బస్టాండు మీదుగా రెండు కిలో మీటర్లు క్రీడాకారులు, యువకులతో కలిసి పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువకులు శారీరక దృఢత్వం ఆరోగ్యం కోసం ఉదయం లేదా సాయంత్రం వ్యా యామం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ వెంకటేష్‌తో పాటు మండల కేంద్రానికి చెందిన యువకులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లో ఎస్సై సర్తాజ్ పాషా ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ నిర్వహించారు. కార్యక్ర మంలో పోలీసు సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లో ఎస్సై విక్రమ్ ఆధ్వర్యంలో పోలీసులు 2కే రన్ నిర్వహించారు. అంగడిబజార ఏరియా నుంచి పోలీసు స్టేషన మీదుగా రెండు కిలో మీటర్లు పరుగు నిర్వహించారు. కార్యక్ర మం లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎస్సై అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ నుంచి బొంబాయిగూడ వరకు పరుగు పందెం నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బం ది, యువకులు తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లో పోలీసుల ఆధ్వర్యంలో ఎక్తా ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎస్సై మధు కర్ యువకులతో కలిసి 2కే రన్‌లో పాల్గొ న్నారు. అనంతరం హట్టి నుంచి కెరమెరి వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పోలీ సు సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలో పో లీసుల ఆధ్వర్యంలో యూనిటీ రన్ కార్యక్ర మం నిర్వహించారు. ఈ యూనిటీ రన్ కార్య క్రమాన్ని జైనూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సై రవికు మార్, పోలీస్ సిబ్బంది, టీజీఎస్‌సీ ఫోర్స్, వి ద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎస్సై సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో 2కే రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా పోలీసు స్టేషన్ నుంచి పరుగు పందెం నిర్వ హించారు. కార్యక్రమంలో పోలీసు సి బ్బంది, యువకులు తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో 2కే రన్‌లో పాల్గొన్న ఎస్పీ, పోలీసులు, యువకులు



రెబ్బెనలో 2కే రన్‌లో పాల్గొన్న ఎస్సై, పోలీసులు, యువకులు



సిర్పూర్(యు)లో పాల్గొన్న సిబ్బంది, యువకులు

డిప్యూటేషన్‌ను రద్దు చేయాలి



ఎమ్మార్సీ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

సిర్పూర్(టి), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింత కుంట పాఠశాలకు చెందిన ఎస్‌జీటీ ఉపాధ్యాయుడికి అధికారులు ఇచ్చిన డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చింతకుంట గ్రామస్థులు ఎంఆర్‌సీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాఠశాలలో 85 మంది విద్యార్థులు ఉండగా ఇద్దరు ఉపాధ్యాయు లకు గాను ఒక ఉపాధ్యాయుడికి డిప్యూటేషన్‌పై పంపించడం ఎంత వరకు సమంజసమన్నారు. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగకుం డా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కార్యా లయంలో వినతిపత్రం అందజేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమం లో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో విద్యుత్ కనెన్షన్ ఇవ్వనందుకు రూ. ఏడు వేలు జరిమానా

కాగజ్‌నగర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ముస్తాఫ అలీకి చెందిన వ్యాపార సంస్థకు కరెంటు కనెక్షన్ కోసం డబ్బులు చెల్లించినా సకాలంలో చర్యలు తీసుకోకపోవడంతో విద్యుత్ వినియోగదారుల ఫోరంలో పరిశీలించి శుక్రవారం ఆ సంస్థకు రూ. ఏడు వేల జరిమానా విధించారు. ముస్తాఫ అలీకి కరెంటు సరఫరా ఇవ్వక పోవడంతో నేరుగా విద్యుత్ వినియోగదా రుల ఫోరంలో ఫిర్యాదు చేశారు. పక్కా ఆధారాలు చూపించారు. పక్షం రోజుల్లో కరెంటు సరఫరాను పునరుద్ధరించాలని ఫీజు కట్టినా కరెంటు సరఫరా చేయనందుకు రూ.ఏడు వేల జరిమానా విధిస్తూ ఫోరం అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పదిహేను రోజుల్లో డబ్బులు చెల్లించాలని ఆ ఉత్తర్వుల్లో సూచించారు.

గుడుంబా నిషేధానికి గ్రామస్థుల ప్రతిజ్ఞ

పెంచికలపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని ఆగరగూడ గ్రామంలో ఎస్సై అనిల్ ఆధ్వ ర్యంలో గ్రామస్థులు గుడుంబా నిషేధానికి శుక్రవారం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత సహకారంతో గుడుంబా రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని అన్నారు. యువత మద్యం మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆగర్‌గూడ యువకులను ఆదర్శంగా తీసుకుని ప్రతి గ్రామంలో మద్యంపై యుద్ధం ప్రకటిం చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఆగర్‌గూడ గ్రామస్థులు

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

ఆసిఫాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావును రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ఉత్తర్వులు జారీ చేయడంతో శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చా రు. పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్ అన్ని వర్గాలకు న్యాయం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకుల బాలేష్‌గౌడ్, చరణ్, వసంత్‌రావు, దత్తు, జావీద్, తదితరులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

ఆసిఫాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాంద్రె విశాల్ జన్మదినం సందర్భంగా శుక్రవారం అభిమానులు ప్రభు త్వ ఆసుప్రతిలోని బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. కార్యక్రమంలో గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



ఆసిఫాబాద్‌లో ఉదయ్‌బాబును సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు



రెబ్బెనలో అటవీ అధికారి దేవదాస్ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

రెబ్బెన, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉద్యోగులు చేసిన సేవలతోనే గుర్తింపు ఉంటుందని ఎఫ్‌డీపీటీ సీసీఎఫ్ శాంతారాం అన్నారు. ఆసిఫాబాద్ ఫారెస్టు డివిజన్ అధికారిగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన దేవదాస్‌కు రెబ్బెన మండలం గోలేటి సింగరేణి సీఈఆర్ క్లబ్‌లోని అటవీశాఖ ఆధ్వ ర్యంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్, కాగజ్‌నగర్ ఎఫ్‌డీఓ సుశాంత్‌సుఖదేవ్‌లతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవదాస్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యాలయ పరిపాల నాధికారి వెంకటకృష్ణ, అటవీ రేంజ్ అధికారులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో పరీక్షల సహాయ కమిషనర్ ఉదయబా బు పదవీ విరమణ పొందడంతో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు ఆయనను ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, అనీల్‌కుమార్, నరసింహచారి, ప్రకాష్, రాకేష్, రవిశంకర్, సోనేరావు, రవి పాల్గొన్నారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణం లో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుద్మేత విశ్వనాథ్‌రావు, మహగాం స్కూల్ కాంప్లెక్స్ ప్రధా న ఉపాధ్యాయురాలు ఆ త్రం రాంబాయిలు అ న్నారు. మహగాం బాలి కల ఆశ్రమోన్నత పాఠ శాల ప్రాంగణంలో శుక్ర వారం మహగాం స్కూ ల్ కాంప్లెక్స్ పరిధిలోని కల్లురుగూడ పాఠశాల ఉపాధ్యాయుడు కోడప్పా శ్యాం రావు పదవీ విరమణ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏసీఆర్పీ మండాడీ గగ్రు, ఉపాధ్యాయు లు గెడం జగ్జీవన్,కోట్నాక పాండురంగ్,కుమ్ర భీంరా వు,తార,ఆత్రం ప్రభు,కోవ నారాయణ, రిటైర్డ్ ఉపాధ్యా యుడు ఆత్రం ఆనంద్‌రావు పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు తమ జీవన విధానంతో ఇతరులకు ఆదర్శంగా నిలువాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయం ఆవరణలో పదవీ విరమణ పొందిన సర్వే అధికారి ఎంటీవీ స్వామిని అధికారులతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాస్, నరేందర్, అధికారులు కృష్ణమూర్తి, అఫ్సర్‌పాషా, శ్రీనివాస్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని ప్రధానో పాధ్యాయుడు సదాశివ్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో ఉపాధ్యాయుడు షాహిబ్‌హుస్సేన్ పదవీ విరమ ణ పొందడంతో ఆయనను ఉపాధ్యా యులతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మజారుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కాసిపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాసిపేట 1వ గని సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోమటిచేనుకు చెందిన కామెర శంకర్ కోమటిచేను నుంచి కాసిపేట 1వ గనికి బైక్‌పై వెళ్తున్నాడు. కాసిపేట నుంచి దేవాపూర్ వైపు వస్తున్న ముగ్గురు యువకులు బైక్‌తో వచ్చి వేగంగా ఢీకొట్టారు. దీంతో శంకర్ రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు. బైక్‌పై ఉన్న ఒక యువ కుడికి కాళ్లకు చేతులకు తీవ్ర గాయా లైనట్లు స్థానికులు తెలిపారు. ఇరు వర్గాలు ఆసుపత్రిలో ఉండడంతో ఎవరు ఫిర్యాదు చేయనట్లు తెలిసింది.

జెండా ఎగురవేత

ఆసిఫాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలో శుక్రవారం ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పలువురు నాయకులు జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు దివాకర్‌గౌడ్, శంకర్, చిరంజీవి, భూమ న్న, అశోక్, సుధాకర్, ప్రకాష్, శ్రీనివాస్, మోహన్, దివాకర్, కొమురక్క, సుధాకర్, తిరుపతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎఫ్ఎస్‌వో మృతి


జాలిమ్‌షా(ఫైల్)

కాసిపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా పనిమెల అటవీ సెక్షన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న మెస్రం జాలిమ్‌షా(56) గుండె పోటుతో శుక్రవారం తెల్ల వారుజామున మృతిచెందినట్లు కుటుంబీకులు తెలి పారు. జాలి మ్‌షా స్వగ్రామం ఆదిలా బాద్ జిల్లా నార్నూర్ మండలం గుంజా లకు చెందిన వ్యక్తి. వివాహం అనంతరం అత్తగారి ఇల్లు అయిన కాసిపేట మం డలం దేవాపూర్‌లో వచ్చి స్థిరపడ్డాడు. అలాగే ఉద్యోగ రీత్యా కాసిపేట మండలంలోనే ఎక్కువ సంవత్సరాలు విధులు నిర్వహించాడు. జాలిమ్‌షా మృతిచెందడంతో దేవాపూర్‌లో విషాధం నెలకొంది. జాలిమ్‌షా చిత్రపటానికి ఆది వాసీ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దెబ్బతిన్న పంటలు.. ఆందోళనలో రైతులు


బెజ్జూరులో నేలవాలిన వరి

బెజ్జూరు/పెంచికలపేట/కాగజ్‌నగర్‌టౌన్/దహెగాం/సిర్పూర్(టి)/అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో తుఫాను ప్రభావంతో మూడు రోజుల పాటు కురిసిన వర్షానికి వరి, పత్తి, ఇతర పంటలు నేలపాలయ్యాయి. వరి కోతకు వచ్చిన సమయంలో వర్షాలకు పైరు నేలవాలి గింజలు రాలడమే కాకుండా పంట నీట మునిగాయి. వరి, పత్తి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. మండలంలో గత రెండు రోజులుగా కురుస్తునన వర్షాలకు రైతులు సాగు చేస్తున్న పత్తి, వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

ఈ ఏడాది అతి వృష్టి కారణంగా కనీసం పెట్టుబడులు కూడా వచ్చేలా కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వరి పంట పూర్తిగా నీటిలో తడిచి పోవడంతో నేల వాలింది. దహెగాం మండలంలోని లగ్గాం, దహెగాం, కల్వాడతో పాటు వరి పంట చేతికి అందివచ్చిన సమయంలో నేలపాలైంది. వరి నేల పాలు కావడంతో దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. అదే విధంగా పత్తి పంట ఏరివేత దశలో వర్షాలు కురుస్తుండడంతో కాయలు నల్లబడి పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూత కాత రాలి పోతుందని వాపోతున్నారు.

సిర్పూర్(టి) మండలంలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలో 27 గ్రామాల్లో ఈ ఖరీఫ్‌లో దాదాపు వరి 4,300 ఎకరాల్లో, పత్తి 16 వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. అయితే వరి, పత్తి పంటలు చేతికి వచ్చే దశలో మొంథా తుఫాను ప్రభావంతో పంటల దిగుబడిపై పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు తొందర పడి తమ పంట కోతలు చేపట్టరాదని ఎండలు కొట్టే వరకు కోతలు మొదలు పెట్టవద్దని ఏవో గిరీష్ తెలిపారు. అలాగే రైతులు ఆయా ఏఈవోల వద్ద తమ పంటల వివరాలను నమోదు కోసం పటాట పాసు పుస్తకం, ఆధార్‌తో జత పరిచి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.

కాగజ్‌నగర్ మండలంలో పత్తి పంట అకాల వర్షాలకు దెబ్బతినే అవకాశాలుండడంతో దిగాలు పడుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న గాలులు, వర్షాలకు వరి కోతకు ముందే నేల వాలుతోంది. వేలాది ఎకరాల్లో పంట నష్టం కలుగుతుండడం వలన రైతులు ఆందోళన చెందుతున్నారు. (వరి పంట నేల కొరగడంతో పాటు పలు చోట్ల తడిసి పోవడంతో ధాన్యం రంగు మారి గిట్టుబాటు ధర రావడం కూడా గగనంగానే మారిందనే రైతులు వాపోతున్నారు. మరి కొన్ని చోట్ల పత్తి తడిసి నల్లగా మారి పోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెంచికలపేట, మండల వ్యాప్తంగా మంగళ, బుధవారాల్లో కురిసిన వర్షాలకు కోత దశలో ఉన్న వరి పంట నేలవాలింది. ఏరివేతకు సిద్ధంగా ఉన్న పత్తి పంట తడిచి పోగా కాయలు మురిగిపోయే దశకు చేరుకున్నాయి. ఈ అకాల వర్షాల కారణంగా కనీసం పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని రైతులు ఆవేదన చెందుతున్నారు.



కౌటాలలో నీట మునిగిన వరి పంట, దహెగాంలో నల్లబడుతున్న పత్తి

విద్యార్థులు వ్యసనాల బారిన పడొద్దు


బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యసనాల బారిన పడొద్దని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా 'డ్రగ్స్ నివారణ పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్ నుంచి ఏ విధంగా దూరం ఉండాలి' అన్న అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో విజేతలకు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాల నుంచి పూర్తిగా దూరంగా ఉండి తమ లక్ష్యాల సాధనలో కృషి చేయాలని సూచించారు. డ్రగ్స్ వ్యసనాన్ని నిరోధించడంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని అవగాహన ద్వారా మాత్రమే సమాజం మత్తు పదార్థాల ముప్పు నుంచి రక్షించబగలమని పేర్కొన్నారు. అనంతరం విజేతలుకు నిలిచిన మొదటి స్థానం పి.కీర్తన(సిర్పూర్-యూ), రెండవ స్థానం డొంగ్రి త్రిషిక, మూడో స్థానం ఎస్‌స్ఫూర్తి (రెబ్బెన)లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, సీఐ రాణా ప్రతాప్, ఆర్ఐ అంజన్న, రవీందర్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్,(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదవీ విరమణ పొందిన ఇద్దరు పోలీసు అధికారులను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సన్మానించారు. ఏఎస్సై మీల్ అహ్మద్, హెడ కానిస్టేబుల్ రఘునాథ్ సర్కార్‌లు పదవీ విరమణ పొందగా వారిని సన్మానించి మాట్లాడారు. డ్యూటీ సమయంలో క్రమ శిక్షణతో విధులు నిర్వర్తించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకు వచ్చిన వీరి సేవ లను కొనియాడారు. అలాగే కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా జమ చేసుకున్న మొత్తాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. జమీల్ అహ్మద్‌కు రూ.59,443, రఘునాథ్ సర్కా ర్‌కు రూ.2,44,269 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ పెద్దన్న, సీఐ రాణా ప్రతాప్, జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు విజయశంకర్‌రెడ్డి, కో ఆపరేటివ్ సొసైటీ ఇన్‌చార్జి జాఫరుద్దీన్‌పాల్గొన్నారు.

తిర్యాణి మండలంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

ఆసిఫాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆకాంక్షిత బ్లాక్ జిల్లాలోని తిర్యాణి మండలంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో శుక్రవారం అకాంక్షిత బ్లాక్ తిర్యాణి మండలంలో చేపట్టాల్సిన మౌలిక వసతుల పనులపై విద్య, వైద్య, ఆరోగ్య, శిశు సంక్షేమ, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకాంక్షిత బ్లాక్ తిర్యాణి మండలంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు రావాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో ఆర్‌ఓ ప్లాంట్ ఏఆర్పటు చేసి ఆసుపత్రికి వచ్చే ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించాలని, రోగులతో వచ్చే సహాయకులకు వెయిటింగ్ గదులను నిర్మించాలని, రోగులకు వైద్య సేవలు అందించేందుకు అవసరమైన పరికరాలు సమకూర్చాలని తెలిపారు. తిర్యాణి మండలాన్ని అ న్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, ఎంపీడీవో మల్లేష్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు



క్రీడా ప్రాంగణంలో పెరిగిన పిచ్చి మొక్కలు

దండేపల్లి అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడా ప్రాంగణాలు అలంకారప్రాయంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల యువకులకు క్రీడల్లో నైపుణ్యం కలిగించే విధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీలో ఒక క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసింది. గ్రామాలకు దూరంగా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడంతో అవి నిరుపయోగం మారాయి. దండేపల్లి మండలం గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని రంగంపల్లి గ్రామ శివారులోని ఓ గుట్టపై క్రీడా ప్రాంగణాన్ని అప్పటి అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో క్రీడా ప్రాంగణమంత ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలతో నిండిపోయి దర్శనమిస్తోంది. నంబాల పంచాయతీ పరిధిలో గూడెం శివారులో గూడెం ఎత్తిపోతల పథకం పైపులైన్‌లో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారు. కానీ పైపులైన్ లీకేజీల కారణంగా తొలగించిన పైపులైన్లపై క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేయడంతో అక్కడ క్రీడా ప్రాంగణం నిరుపయోగంగా మారింది. పెద్దపేటలో లక్ష్మీకాంతపూర్‌లో వెళ్లే రోడ్డులో క్రీడా ప్రాంగణం అవరణంలో కొత్త గ్రామపంచాయతీ భవనం నిర్మించడంతో అక్కడ కూడా క్రీడా ప్రాంగణం నిరుపయోగంగా మారింది. మండలంలోని గ్రామీణ ప్రాంత యువకులకు దూరంగా ఈ క్రీడా ప్రాంగణలు ఏర్పాటు చేయడంతో అవి నిరుపయోగంగా మారాయి.



పెద్దపేట క్రీడా ప్రాంగణంలో నిర్మించిన భవనం

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఇటుక బట్టీలో నేలవాలిన విద్యుత్ వైరుకు తగిలి గొర్రెల కాపరి మృతిచెందాడు. పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేషం తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన దాగేటి మల్లేశం (30) అనే గొర్రెల కాపరి రోజువారీగా శుక్రవారం గొర్రెలను మేపేందుకు గ్రామ శివారులోని ఓ ఇటుక బట్టీ నుంచి వెళుతున్నాడు. ఈ క్రమంలో ఇటుక బట్టీలోని విద్యుత్ వైరు నేలపై పడి ఉండటంతో అటువైపుగా వెళ్తున్న గొర్రెకు షాక్‌కు గురైంది. గమనించిన గొర్రెల కాపరి మల్లేశం గొర్రెను కాపాడేందుకు యత్నిస్తుండగా అతను కూడా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసిన మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, యాదవ సంఘం నాయకులు పెద్ద ఎత్తున సంఘటన స్థలం వద్దకు చేరుకొన్నారు. మృతుడి కుటుంబానికి ఇటుక బట్టీ యజమాని న్యాయం చేయాలని, అప్పటి వరకు సంఘటన స్థలం నుంచి మృతదేహాన్ని తీయవద్దని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. దీంతో మృతదేహాన్ని పంచనామాకు తరలించకుండా ఎస్ఐ మల్లేష్ దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనపై ఫిర్యాదులు రాలేదని పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

కోతుల దాడిలో ఒకరికి గాయాలు

సుల్తానాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కోతులు దాడి ఘటనలో ఒకరు గాయపడ్డారు. పూసాల రోడ్డు, జవహర్‌నగర్ ప్రాంతంలో ఎల్ల మల్లేశం అనే వ్యక్తి ఇంటి ఎదుట ఉన్న కోతులను తరుముతుండగా అతనిపై దాడి చేసి గాయపరి చాయి. బాధితుడు ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. మున్సి పల్ అధికారులు కోతుల బెడద నివారించాలని కోరుతున్నారు.

సింగరేణి సమాచారం

ఉద్యోగుల శ్రమదానం అభినందనీయం


శ్రమదానంలో పాల్గొన్న జీఎం, సింగరేణి ఉద్యోగులు

రెబ్బెన, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నెల రోజులుగా నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపె యిన్ 5.0 కార్యక్రమంలో సింగరేణి ఉద్యోగులు పరిసరాల పరిశుభ్రతకు శ్రమదానం చేయడం అభినందనీయమని జీఎం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఖైరిగూడ ఉపరితల గని, గోలేటిలోని రామాలయం పరిసరాల్లో స్వచ్ఛత కోసం శుక్రవారం శ్రమదానం చేశారు. ఖైరిగూడ ఓసీ సబ్ స్టేషన్ సమీపంలో ముళ్ల పొదళ్లను తొలగించారు. రామాలయం పరిసరాలను జీఎం కార్యాలయం ఉద్యోగులతో కలిసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు నరేందర్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి తిరుపతి, ఏరియా ఇంజనీర్ కృష్ణమూర్తి, ఉజ్వల్‌కుమార్ బెహెరా, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న, డీజీఎం మదీనాభాషా, మేనేజర్ శంకర్, హెచ్‌ఓడీ శ్రీనివాస్, నాయకులు మొగిలి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): సింగరేణి క్యాంటీన్ సేవలను ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవలని జీఎం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఖైరిగూడ ఉపరితల గని వద్ద ఆయన పర్యటించారు. క్యాంటీన్‌లో వినియోగించేందుకు కొత్త వంట సామాగ్రి, పరికరాలను నిర్వాహణ సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా జీఎం మా ట్లాడుతూ గతంలో కాంట్రాక్టర్ ద్వారా నిర్వహించిన క్యాంటీన్‌ను ఏడాదిగా సింగరేణి ఉదోయగులతో సమర్థవంతంగా నిర్వహించడాన్ని అభినందించారు. కార్యక్రమంలో పీవో నరేందర్, ఏఐటీయూసీ కార్య దర్శి తిరుపతి, ఏరియా ఇంజనీర్ కృష్ణమూర్తి, ప్రాజెక్టుఇంజనీర్ వీరన్న, డీజీఎం మదీనాషేక్, మేనేజ శంకర్, హెచ్‌ఓడీ శ్రీనివాస్, నాయకులు మొగిలి, శ్రీనివాస్, సంక్షేమాధికారి రజినీకుమార్ పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు పోరాటం

మందమర్రిటౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా సంఘటిత, అసంఘటి త కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు ఎంతో మంది నాయకులు ప్రాణత్యాగాలు చేశారని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి భీమనాథుని సుదర్శన్‌లు అన్నారు. యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకు. శుక్రవారం పట్టణంలోని యూనియన్ కార్యాలయం వద్ద జెండా ఎగురవేశారు. ప్రాణత్యాగం చేసిన యూనియన్ నాయకులకు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ తమయూనియన్ ఉద్యోగులకు ఎన్నో హక్కులు సాధించి పెట్టిందన్నారు. కార్మికులు ఐదు సార్లు తమను గుర్తింపు సంఘంగా ఎన్నుకు న్నారన్నారు. కార్మికుల సంక్షేమం, హక్కుల సాధన కోసం అనేక పోరాటాలు చేశామన్నారు. తమ యూనియన్ స్వాతంత్ర్యానికి ముందు నుంచి ఉందన్నారు. కార్మికులకు అండగా నిలుస్తూ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న యూనియన్ తమదేనని తెలిపారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్ల పరిష్కారం కోసం కార్యచరణ రూపొందించామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బానయ్య, రాజేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, సుదర్శన్, తిరుపతి, గాండ్ల సంపత్, పాషా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): కార్మికుల అండగా నిలబడే సంఘం ఏఐటీయూసీ అని ఆ యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య అన్నారు. ఏఐటీయూసీ యూనియన్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, కార్మికుల కష్టాలు దూరం చేసేందుకు నాటి పరిస్థితులకు అనుగుణంగా ముంబై నడి సముద్రంలో పడవలో రహస్యంగా సమావేశమై ఏఐటీయూసీని స్థాపించారని చెప్పారు. ఆనాటి నుంచి నేటి వరకు కార్మికుల పక్షాన ఉంటూ వారికి న్యాయంగా రావాల్సిన హక్కులను సాధిస్తున్నామని తెలిపారు. కార్మికుల హక్కులు, డిమాండ్ల సాధనకు పాటుపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, పిట్ కార్యదర్శులు మురళీ చౌదరి, దాడి రాజయ్య, మోతె లచ్చన్న, గునిగంటి నర్సింగరావు, ఆడెపు మల్లికార్జున్, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


మందమర్రిలో జెండా ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఆర్కే ఓసీపీకి ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతాం



మాట్లాడుతున్న జీఎం రాధాకృష్ణ

మందమర్రిటౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మందమర్రిఏరియాలోని ఆర్కే ఓసీపీకి త్వరలోనే ప్రజాభిప్రాయ సేకరణ చేపడతామని, తిరిగి పునః ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందిం చామని మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణతెలిపారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రామకృష్ణపూర్‌కు పూర్వవైభవమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఆర్కే ఓసీపీలో అనివార్య కారణాల వల్ల మూత పడిందని, తిరిగి పునః ప్రారంభానికి సంబంధించి అనుమతులు తీసుకున్నామని తెలిపారు. ప్రారంభానికి సంబంధించి కార్మిక సంఘాలు, పట్టణ ప్రజలు సహకరించా లన్నారు. ఓసీపీ ప్రారంభమైతే ఏరియాకు మంచి లాభాలు వచ్చే అవకాశాలుంటా యన్నారు. ఇప్పటికే ఓసీపీని సందర్శించి పునః ప్రారంభ పనుల్లో నిమగ్నమైనట్లు తెలిపారు. వార్షిక ఉత్పత్తి సాధనలో వర్షాలతో కొంత వెనకబడి ఉన్నామని, కేకే 5 గని ఉత్పత్తిలో వంద శాతంతో ముందుందన్నారు. కార్మికులు రక్షణ సూత్రాలు పాటిస్తూ విధులు నిర్వహించా లన్నారు. కార్మికుల సంక్షేమానికి తాము ముందుంటామన్నారు. త్వరలోనే కాలనీలను సందర్శించి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

సెల్‌టవర్ ఎక్కిన యువకుడు


టవర్ ఎక్కిన యువకుడు కిష్టయ్య

బెజ్జూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నలుగుపల్లి గ్రామంలో పెళ్లి చేసుకుంటామని చెప్పిన యువతితో పాటు ఆమె తల్లిదండ్రులు నిరాకరించడంతో మనస్తాపానికి గురైన యువకుడు శుక్రవారం సెల్‌టవర్ ఎక్కి హల్ చెల్ చేశాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మద్దిగూడ గ్రామానికి చెందిన కోరితే కిష్టయ్య అనే యువకుడు మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి నాలుగు నెలలుగా ప్రేమించుకుంటున్నారు. మొదట పెళ్లి చేసుకుంటామని యువతి అంగీకరించింది. కానీ కొద్ది రోజుల నుంచి తన ప్రేమను నిరాకరిస్తుందని, తమ ప్రేమకు ఆమె తల్లిదండ్రులు కూడా అడ్డు పడుతున్నారని ఫోన్ చేసినప్పటికీ స్పం దించక పోవడంతో మనస్తానికి గురైన యువకుడు తనకు న్యాయం చేయాలని టవర్ ఎక్కాడు. ఈ విషయం గ్రామంలో ఉన్న కుటుంబ సభ్యులు, మిత్రులకు, పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని మాట్లాడారు. తాము న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో కిందికి దిగాడు. విషయం తెలుసుకున్న బెజ్జూరు ఎస్సై సర్తాజ్ పాషా చేరుకొని యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. యువతి, యువకుడి తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం ఎస్సై కౌన్సెలింగ్ చేసి ఇంటికి పంపించారు.

వైద్య చికిత్స కోసం ఆర్థిక సాయం అందజేత

బెల్లంపల్లి, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వైష్ణవి అనే విద్యార్థినికి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైష్ణవికి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు రూ. 12,500 ఆర్థిక సాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వరూప, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

కాసిపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ వల్ల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో రైతు లు మండల వ్యవసాయాధికారి ప్రభాకర్‌కు వినతి పత్రం అందించారు. సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గోనెల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు పత్తి రైతులు తీవ్రంగా నష్ట పోయా రని, చేతికి వచ్చిన వరి పంట కూడా నేల కొరిగిందన్నారు. నష్టపోయిన పంటలను సర్వే చేసి నష్టపరిహారం అందించాలని కోరా రు. గోనెల శ్రీలత, పోశం, రత్నం రమేష్, పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కొడిమ్యాల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్ గ్రామ శివా రులో శుక్రవారం సాయంత్రం పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను కొడిమ్యాల ఎస్ఐ ఎస్ సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. కొండాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని వారి వద్ద 6,050రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సంబురం..సగమేనా..

- ఉచిత బియ్యానికే పరిమితమైన కొత్త రేషన్‌కార్డులు
- వర్తించని గృహజ్యోతి పథకాలు
- కొత్త దరఖాస్తులకు నో ఆప్షన్
- కార్యాలయాల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు

నెన్నెల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పేదలకు కొత్తగా ఆహార భద్రత కార్డులు పంపిణీ చేసినప్పటికీ కార్డులతో వారు పూర్తిస్థాయి లబ్ధి పొందడం లేదు. తెల్ల రేషన్‌కార్డులతో వివిధ సంక్షేమ పథకాలు పొందే అవకాశం ఉన్నప్పటికీ కొత్త కార్డుదారులకు అవి ఏవీ అందడం లేదు. లబ్ధిదారులు ఉచిత బియ్యానికి మాత్రమే పరిమితమయ్యారు. తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉంటే గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, సబ్సిడీ కింద రూ.500లకే ఎల్‌పీజీ సిలెండరు పొందవచ్చు. ఆహార భద్రతా కార్డులు మం జూరై నాలుగు నెలలు కావస్తున్నా ప్రభుత్వం ఇతర సంక్షేమ పథకాల ఊసెత్తడం లేదు. చాలా ఏళ్ల నిరీక్ష ణ అనంతరం కార్డులు రాగా, పూర్తిస్థాయి లబ్ధి చేకూ రక పోవడంతో నిరాశ చెందుతున్నారు. పథకాల కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించ కపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

కొనసాగుతున్న కార్డుల జారీ ప్రక్రియ

జిల్లాలో 2,20,543 పాత రేషన్ కార్డులు ఉండగా, సుమారుగా 27 వేల కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేశారు. 50 వేల మంది వరకు లబ్ధిదారులుగా నమోదయ్యారు. ఆహారభద్రత కార్డుల జారీ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. మీసేవా కేంద్రాల ద్వారా కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారికి, వారి ఆర్థిక స్థితిగతులపై రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అర్హులను గుర్తించి కార్డులు జారీ చేస్తున్నారు. ఆహార భద్రత కార్డు పొందిన వెంటనే కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి 6 కేజీల చొప్పున ఉచిత బియ్యం అందిస్తున్నారు.

అప్పుడు కార్డులేక..

గత సంవత్సరం జనవరిలో ప్రజా పాలన గ్రామసభలు నిర్వహించి వచ్చిన దరఖాస్తుల ఆధారంగా సంక్షేమ పథకాలు అమలు చేశారు. ప్రజాపాలనలో నమోదు చేసుకొని ఉన్నవారికి మాత్రమే 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ 500లకు సబ్సిడీ సిలెండర్ అందుతున్నాయి. అలాంటి అవకాశం కొత్త లబ్ధిదారులకు లే దు. ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించిన సమయంలో కార్డు లేక పోవడంతో వీరందరు అర్జీలు అందించలేకపోయారు.

కొందరు దరఖాస్తు చేసుకున్నప్పటికీ రేషన్ కార్డు లేదనే నెపంతో వాటిని పక్కకు పెట్టేశారు. ప్రజాపాలన దరఖాస్తులు నిరంతర ప్రక్రియ అని అప్పుడు అధికారులు చెప్పినప్పటికీ, పాత దరఖాస్తుల్లో తప్పుల సవరణకు మాత్రమే అవకాశం కల్పించారు. కొత్తగా అర్జీలు స్వీకరించడం లేదు. మీసేవాలో దరఖాస్తు చేసుకోవాలనుకున్నా కొత్త వారి కోసం ఆన్‌లైన్‌లో నమోదుకు వెబ్ ఆప్షన్ కూడా అందుబాటులో లేదు. దీంతో కొత్త కార్డుదారులందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారు.



నెన్నెలలో కొత్త రేషన్ కార్డు మంజూరు పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వినోద్(ఫైల్)

కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం..: ఎంఏ తాజ్, నెన్నెల



కొత్త రేషన్ కార్డు వచ్చిందన్న మాటే గాని దాంతో పూర్తిస్థాయి లబ్ధి చేకూరడం లేదు. ఆహారభద్రత కార్డును ఉచిత బియ్యంతోనే సరిపెడుతున్నారు. ఇతర పథకాలు వర్తించడం లేదు. దరఖాస్తు చేసేందుకు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్తే ఆప్షన్ లేదంటున్నారు. పథకాలకు అర్హులమైనప్పటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ.500లకే ఎల్‌పీజీ సిలెండరు పొందలేక పోతున్నాం. నాలాగా చాలా మంది కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు. ఇప్పటి కైన కొత్త రేషన్ కార్డులు పొంది న వారికి అన్ని పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి.

ఎస్టీపీపీలో ప్రతిజ్ఞ



ఎస్టీపీపీలో ఐక్యత ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

జైపూర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : సర్దార్‌వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం ఎస్టీపీపీలో అధికారులు జాతీయ ఐక్యత దినోత్సవాన్ని నిర్వహించారు. వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు. ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్‌ను అందరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జీఎం నరసింహారావు, అధికారులు మదన్ మోహన్, సంతోష్‌కుమార్,మురళీధర్, అజాజుల్లాఖాన్, కిరణ్‌బాబు, ఏఐటీయూసీ అసిస్టెంట్ పిట్ సెక్రటరీ నర్సయ్య పాల్గొన్నారు.

మబ్బులతో కంది పంటకు చీడపీడలు

కాసిపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కంది పంటకు చీడపీడలు ఎక్కువగా ఆశిస్తాయని మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ అన్నారు. మామిడిగూడెంలోని రైతులకు శుక్రవారం కంది పంటపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చీడపీడలు ఆశిస్తే దిగుబడిపై ప్రభావం తగ్గుతుందని, దీని నివారణకు మందులను పిచికారీ చేయాలన్నారు. ఏఈవో శ్రీధర్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

జగిత్యాల టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిందని టౌన్ సీఐ కరుణాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించగా, సుమారు 65 నుంచి 70 ఏళ్ల మధ్య వయసున్న గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం పడిఉంది. అక్కడ స్థానికులను విచారించగా, ఆమెకు సంబంధించిన సమాచారం లేకపోవడంతో మృతదేహాన్ని జిల్లా ప్రధానాసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపర్చినట్లు సీఐ తెలిపారు. వృద్ధురాలికి సంబంధించిన సమాచారం తెలిసినవారు జగిత్యాల పట్టణ పోలీసులకు 8712656815 ఫోన్‌నంబర్ ద్వారా సమాచారం అందించాలన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

మల్లాపూర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టాపూర్‌లో ఏనుగు ప్రతాప్‌రెడ్డి (38) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాజు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతాప్‌రెడ్డి జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లి వస్తుండేవాడు. అప్పులు ఐదు లక్షల రూపాయల వరకు ఉం డగా వాటిని ఎలా తీర్చాలో తెలియక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

లక్సెట్టిపేట, అక్టోబరు, 31(ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట పట్టణానికి చెందిన లక్ష్మి, అజయ్ అనే ఇద్దరికి శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను స్థానిక ఎస్సై సురేష్ శుక్రవారం అప్పగించారు. ఇద్దరు బాధితులు కొద్ది రోజుల క్రితం తమ మొబైల్స్‌ని పోగొట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు వాటిని ట్రేజ్ చేసి పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు.



బాధితులకు మొబైల్స్ అందిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలు

హాజీపూర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామ శివార్‌లోని పుష్కర ఘాట్‌కు వెళ్లే దారి దగ్గర నేషనల్ హైవే ఎన్‌హెచ్ 63 రోడ్డుపై శుక్రవారం తెల్లవారుజామున ప్రమాదం జరిగింది. కడెం నుంచి భూపాలపల్లి వైపు వెళ్తున్న వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీకొనడంతో వాహనంలోని ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న హాజీపూర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని గాయపడిన వారిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం వారిని వారి గ్రామాలకు పంపినట్లు హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ రాజ్ తెలిపారు.

ఉద్యోగ విరమణ కార్మికునికి సన్మానం

కాసిపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : కాసిపేట గనిలో హాలర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహించిన జాడి శంకర్ ఉద్యోగ విరమణ పొందగా శుక్రవారం గనిపై అధికారులు, కార్మిక సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ సతీష్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్‌కార్యదర్శి దాగం మల్లేష్, ఐఎన్‌టీయూసీ కేంద్ర ప్రచార కార్యదర్శి బన్న లక్ష్మణ్‌దాస్, టీబీజీకేఎస్ పిట్ సెక్రటరీ బైరి శంకర్, అధికారులు నిఖిల్ అయ్యర్, వెంకటేష్, రామకృష్ణ, మీర్జాగౌస్‌జిషాన్, రాజకీయ పార్టీల నాయ కులు, కార్మికులు పాల్గొన్నారు.

తెగిపడ్డ 11 కేవీ విద్యుత్ తీగలు

మందమర్రిటౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపూర్ పట్టణంలోని తారకరామ కాలనీలో ఇంటిఆవరణలోని పైకప్పుపై 11కేవీ విద్యుత్ ఒకటి తెగి పడింది. రజిత అనే యువతికి షాక్‌కు గురైంది. వెంటనే స్థానికులు విద్యుత్‌శాఖ అధికారులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. తెగిపడిన తీగలు సిబ్బంది తొలగించారు.

ఘనంగా ఇందిరా గాంధీ వర్ధంతి



మందమర్రిలో నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



బెల్లంపల్లిలో కాంగ్రెస్ నాయకుల నివాళులు

లక్సెట్టిపేట, అక్టోబరు, 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐబీ ఆవరణలో మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ వర్ధంతిని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండి, ఆరీఫ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్ కుమార్, నాయకులు చిన్న రమేష్, చంద్రమౌళి, మడిపెల్లి స్వామి, లచ్చన్న, వెంకటస్వామిగౌడ్, దేవా, రాజమౌళి, ఉత్తూరి రవీందర్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో భారత దేశ మాజీ ప్రధాని భారత రత్న ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. నాయకులు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాలులు ఆర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: భారతదేశ మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ వర్ధంతిని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా చిత్రపటానికి నాయకులు పూల మాలలు వేసి నివాలులు ఆర్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ దేశ అభివృద్ధి ప్రజల సంక్షేమానికి ఎనలేని సేవలు అందించిన మహానాయకురాలు ఇందిరా గాంధీ అన్నారు. నాయకులు రాయబారపు కిరణ్, శేఖర్, జావీద్‌ఖాన్, రహీం, గణేష్, మహేశ్, కిరణ్, సతీష్, తరుణ్, అజయ్, చింటు పాల్గొన్నారు.

పటేల్ కృషితోనే సంస్థానాల విలీనం

శ్రీరాంపూర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఉప ప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషితోనే 500 సంస్థానాలు భారతదేశంలో విలీనమయ్యాయని శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం కుర్మ రాజేందర్ అన్నారు. పటేల్ 150వ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని జీఎం కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సిబ్బందితో రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోతుకూరి కొమురయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) బీభత్స, డీజీఎం (ఐఈడీ) రాజన్న, డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్, డీజీఎం(ఫారెస్ట్) హరినారాయణ, డిప్యూటీ సీఎంవో డాక్టర్ పి. రమేష్ బాబు పాల్గొన్నారు.

నస్పూర్ : నస్పూర్ పట్టణంలో సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం సీసీసీ కార్నర్ వద్ద ఎస్సై ఉపేందర్‌రావు ఆధ్వర్యంలో ఏక్తా దివస్‌ను పురష్కరించుకుని 2కే రన్ ఫర్ యూనిటిని నిర్వహించారు. సీసీసీ కార్నర్ వద్ద మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ రన్ ఫర్ యూనిటిని జెండా ఊపి ప్రారం భించారు. కార్యక్రమానికి కృషి చేసిన వారిని సీఐ అశోక్ శాలువాలతో సత్కరించారు. నస్పూర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లంపల్లి: సర్దార్ వల్లబాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలో రన్‌ఫర్ యునిటి వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. వన్ టౌన్ ఎస్ హెచ్‌వో శ్రీనివాసరావు మాట్లాడారు. పోలీసు సిబ్బందితో పాటు యువత వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

తాండూర్ : రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకల్లో భాగంగా శుక్రవారం తాండూర్ మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో 2 కే రన్ నిర్వహించారు. సీఐ దేవయ్య మాట్లాడారు. తాండూర్, మాదారం ఎస్ఐలు కిరణ్‌కుమార్, సౌజన్య, పోలీసులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్ : స్థానిక జీఎం కార్యాయలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జీఎం రాధాకృష్ణ వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏరియా రక్షణ అధికారి భూశంకరయ్య, ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రటరీ సత్యనారాయణ, అధికారుల సంఘం అధ్యక్షుడు రమేష్, పీఎం శ్యాంసుందర్, పర్సనల్ ఆఫీసర్ శంకర్, ఆసీఫ్ పాల్గొన్నారు.

దండేపల్లి : దండేపల్లి పోలీసుల ఆధ్వర్యంలో మేదరిపేట నుంచి దండేపల్లి వరకు 2కే రన్‌ను నిర్వహించారు. దేశ ఐకమత్యానికి ప్రతీకంగా ఈ రన్‌ను నిర్వహించినట్లు ఎస్ఐ తహసీనొద్దీన్ తెలిపారు. దండేపల్లి మాజీ ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్, యువకులు పాల్గొన్నారు.

భీమారం : మండల కేంద్రంలో ఏక్త దివాస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆవడం ఎక్స్‌రోడ్డు నుంచి బస్టాండ్ మీదుగా ఎక్స్‌రోడ్డు వరకు 2కే రన్ నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో రాష్ట్ర జిల్లా స్థాయి ఆటల పోటీల్లో పతకాలను సాధించిన విద్యార్థులు సాహిత్, శ్రీకాంత్‌లను సన్మానించారు. ఎస్ఐ సాగరిక, సిబ్బంది ముత్తయ్య, యు వకులు పాల్గొన్నారు.

కన్నెపల్లి: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం కన్నెపల్లిలో పోలీసుల ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. ఎస్ఐ భాస్కర్‌రావు, పోలీసులు పాల్గొన్నారు.

జన్నారం: రాష్ట్రీయ ఏక్తా దివస్ లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి ఆదేశాల మేరకు జన్నారం పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం రోజున 2కే రన్ నిర్వహించారు. ఏఎస్ఐలు ఉమేశ్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసు స్టేషన్ నుంచి ధర్మారం చౌరస్తా వరకు 2కే రన్ నిర్వహించారు. పోలీసు సిబ్బంది, ఆశ్రమ పాఠశాల పీడీ గణేష్ రాథోడ్ పాల్గొన్నారు.

హాజీపూర్ : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను హాజీపూర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన రాష్ట్రీయ ఏక్తా దినోత్సవం భాగంగా హాజీపూర్‌లో 2కే రన్ నిర్వహించారు. ఎస్ఐ స్వరూప్ రాజ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రాజకీయ ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం 2కె రన్ నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ నుంచి ఊత్కూర్ చౌరస్తా వరకు కొనసాగింది. పోలీసులతో పాటు పట్టణ యువకులు, పలు పార్టీల నాయకలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఈరన్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రమణమూర్తి, ఎస్సై గోపతి సురేష్‌తో పాటు పోలీసులు ఉన్నారు.

చెన్నూరు : చెన్నూరులోని మహాత్మాజ్యోతి బాపూలే పాఠశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ శ్రీకాంత్ వల్ల భాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జీ ఏటీసీ చంద్రయ్య, డీడబ్ల్యూ ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాసిపేట : సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని దేవాపూర్, కాసిపేట పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో జాతీయ సమైక్యత దినోత్సవాన్ని నిర్వహించారు. దేవాపూర్ ఎస్ఐ గంగారాం ఆధ్వర్యంలో 2కే రన్‌నిర్వహించారు. కాసిపేట ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో సోమగూడెం 2కే రన్‌నిర్వహించారు. ఓరియంట్ అధికారులు, పోలీసులు, యువకులు పాల్గొన్నారు.



శ్రీరాంపూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఇన్‌చార్జి జీఎం రాజేందర్, అధికారులు



నస్పూర్‌లో మాట్లాడుతున్న సీఐ అశోక్



హాజీపూర్ మండలంలో 2కే రన్‌లో పాల్గొన్న అధికారులు



లక్సెట్టిపేట 2కే రన్‌లో పోలీసులు, యువకులు



బెల్లంపల్లిలో 2కే రన్ ప్రారంభిస్తున్న వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరావు

పత్తి కొనుగోళ్లకు సన్నద్ధం.

(5వ పేజీ తరువాయి)

తగ్గుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పెట్టుబడులు కూడా చేతికి వస్తాయో.. లేదోనన్న ఆందోళనలో రైతులు ఉన్నారు. పత్తి సాగు చేసింది మొదలు, పంట చేతికి వచ్చే దాకా ఎకరాకు సగటున రూ. 40 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు కనీసం 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా అన్ని ఖర్చులు పోను రూ. 20వేల చొప్పున మిగిలుతుందని చెబుతున్నారు. అయితే ఏ యేడు అతివృష్టితో దిగుబడిపై ప్రభావం చూపు తుందనే అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురియడంతో మొలక దశ లోనే పత్తి పంటకు తీరని నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, సంవత్సరం ఎకరాకు గరిష్ఠం గా 8 క్వింటాళ్లు కూడా దిగుబడి వచ్చే పరిస్థితి లేదని, సాగు ఖర్చులు కూడా గిట్టుబాటు కావని చెబుతున్నారు. ఏ యేడు పత్తికి క్వింటాలుకు రూ. 8,110 మద్దతు ధర ప్రకటించారు. గత ఏడాది క్వింటాలు పత్తి మద్దతు ధర రూ. 7521 ఉండగా, ఈ సంవత్సరం అంతకంటే రూ. 589 ఎక్కువగా పెంచారు.

కపాస్ కిసాన్ యాప్‌లో వివరాలు నమోదు..

సీసీఐకు పత్తి విక్రయించేందుకు ప్రభుత్వం రూపొం దించిన కపాస్ కిసాస్ యాప్‌లో సంబంధిత రైతులు తమ వివరాలు విధిగా నమోదు చేసుకోవాలి. వివరాలు నమోదయ్యాక స్లాట్ బుక్ చేసుకుంటే రైతులకు పత్తి విక్రయం సులువుగా ఉండే అవకాశం ఉంది. జి న్నింగ్ మిల్లుల వెంట రోజుల తరబడి తిరగాల్సిన అవసరం లేకుండా స్లాట్ బుకింగ్ ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. అయితే చాలా మంది రైతులకు కపాస్ కిసాన్ యాప్‌పై పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో ఇప్పటి వరకు ఇంకా వివరాలు నమోదు చేసుకోలేదని సమాచారం. అలాగే స్లాట్ బుకింగ్‌పై కూడా అధికారులు రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

'కులమత బేధం లేకుండా జీవించాలి'




సమావేశంలో పాల్గొన్న ఆర్ఐ, ప్రజలు

దండేపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముత్యంపేట గ్రామంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవ అవగాహన సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆర్ఐ సత్తన్న మాట్లాడుతూ ప్రజలందరు సమానమని, కులమత బేధం లేకుండా అందరు కలిసి కట్టుగా జీవించాలన్నారు. విజిలెన్స్ మానిటరింగ్ జిల్లా సభ్యుడు బచ్చల అంజన్న మాట్లాడుతూ హక్కులను వినియోగించుకుని ఎలాంటి తారతమ్యం లేకుండా ఉండాలని, ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకరావాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పనులను కల్పించాలని పలువురు కోరారు.

ఈ కార్యక్రమంలో రేగుంట లింగయ్య, భూమన్న పాల్గొన్నారు.



ఫీజు బకాయిలు చెల్లించాలి

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలు రూ. 8200 కోట్లను చెల్లించాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. శుక్రవా రం జిల్లా కేంద్రంలో వారు మాట్లాడుతూ పెండింగ్ బకాయిలు చెల్లించాలని విద్యార్థులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఫీజు బకాయిల్లో అక్రమాలు జరిగాయని విద్యాసంస్థల్లో తనిఖీలు చేస్తుండడం సరైంది కాదన్నారు. ఈ విధానాలను మానుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, క్రాంతికుమార్, సతీష్ పాల్గొన్నారు.

చెన్నూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మృతి


ఇస్మాయిల్ జుల్ఫికర్(ఫైల్)

చెన్నూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి):చెన్నూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇస్మాయిల్ జుల్ఫికర్ (65) మృతిచెందాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం తెల్లవారుజామున హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాంగ్రెస్ రాజకీయ కురు వృద్ధుడు, మాజీ ఎమ్మెల్సీ సుల్తాన్ అహ్మద్ పెద్దకుమారుడు ఇస్మాయిల్ జుల్ఫికర్. చిన్ననాటి నుంచే తండ్రి అడుగు జాడల్లో నడుస్తూ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాడు. ఆయన మృతి పట్ల మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణలు సంతాపం ప్రకటించారు. చెన్నూరు ప్రాంత అభివృద్ధికి, సంక్షేమానికి ఆయన చేసిన సేవలను చిరస్మరణీయమని పేర్కొన్నారు.

పత్తి కొనుగోళ్లకు సన్నద్ధం



మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	దిగుబడి (క్వింటాళ్లలో)
బెల్లంపల్లి	6503	52674.3
కాసిపేట	12400	105400
తాండూరు	15121	126905
భీమిని	23190	197115
కన్నెపల్లి	16963	135704
నెన్నెల	9600	76800
వేమనపల్లి	8314	67343.4
కోటపల్లి	19625	162887.5
చెన్నూరు	12890	108276
జైపూరు	6190	51377
భీమారం	4250	34425
మందమర్రి	6600	54120
మంచిర్యాల	480	3840
నస్పూర్	50	400
హాజీపూర్	5880	48804
లక్షెట్టిపేట	5608	44864
దండేపల్లి	4000	32000
జన్నారం	3720	30876

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- అతివృష్టి కారణంగా దిగుబడిపై ప్రభావం
- కపాస్ కిసాన్ యాప్‌లో వివరాల నమోదు తప్పనిసరి
- యాప్, స్లాట్ బుకింగ్‌పై రైతులకు అవగాహన లేమి
- అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయని యంత్రాంగం

మంచిర్యాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌కు సంబంధించి పత్తి కొనుగోళ్ల సోమవారం నుంచి ప్రారంభించనున్నారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)ద్వారా జిల్లాలో పండిన పత్తిని కొనుగోలు చేయనున్నారు. జిల్లాలో మొత్తం 11 సెంటర్లు ఏర్పాటు చేయగా, వాటిలో తాండూరు మండలంలో 4, చెన్నూ రులో 6, లక్షెట్టిపేటలో ఒక కేంద్రం ఉన్నాయి.

వానాకాలం దిగుబడి అంచనా...

జిల్లా వ్యాప్తంగా వానాకాలం పత్తి సీజన్‌కు సంబంధించి 1,61,193 ఎకరాల్లో రైతులు పత్తిపంట సాగు చేశారు. ఎకరాకు సగటున 8 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తుందని అంచనా వేస్తుండగా, మొత్తంగా 13,33,811.2 క్వింటాళ్ల పత్తి రైతుల చేతికి వస్తుందని భావిస్తున్నారు. మండలాల వారీగా పత్తి సాగు, దిగుబడి అంచనా ఇలా ఉంది..

దిగుబడిపై రైతన్నల దిగులు...

ఈ ఏడాది కురిసిన అధిక వర్షాలు పత్తి దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు రైతులు దిగాలు చెందుతున్నారు. పత్తి సాగు చేసినప్పటి నుంచి పలు దఫాలుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. మొదట్లో భారీ వర్షాల కారణంగా వరదలు సంభవించి అధిక మొత్తంలో పత్తి చేలు నీట మునిగాయి. మొక్క ఎదిగే దశలో నీటిలో మునగడం వల్ల కొన్ని చోట్ల వాడిపోయి నష్టం వాటిల్లగా, ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాల కారణంగా పత్తి రంగుమారి నాణ్యత కోల్పోవడంతో పాటు దిగుబడి..

(తరువాయి 7లో)

పీఎస్సార్‌కు కేబినెట్ హోదా..

- పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



మంచిర్యాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుకు కేబినెట్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మ న్‌గా ఆయనను నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. 2023 ఎన్నికల్లో తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన ప్రేంసాగర్‌రావు ఆది నుంచీ మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు.

మొదటి విడుత మంత్రివర్గ విస్తరణలో పీఎస్సార్‌కు రేవంత్ ప్రభుత్వం అవకాశం కల్పించకపోవడంతో రెండో దఫాలో తనకు తప్పని సరిగా బెర్త్ దక్కుతుందనే ఆశా భావనలో ఆయన ఉన్నారు. రెండో దఫాలో జిల్లా నుంచి చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేకానం దకు మంత్రి వర్గంలో చోటు కల్పించారు. దీంతో పీఎస్సార్ ఒకింత నైరాశ్యానికి గురయ్యారు. మూడో విడత మంత్రివర్గ విస్తరణ ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో పీఎస్సార్ తనకు ఆ అవకాశం దక్కుతుందనే ఇంతకాలం ఉన్నారు.

కాగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా రేవంత్‌రెడ్డి మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు మంత్రి పదవిని అప్పగించగా, శుక్రవారం ప్రమాణ స్వీకారం కూడా చేశారు. రాష్ట్రంలో మరో ఇద్దరికి మంత్రి పదవులు ఇవ్వాల్సి ఉండగా, ఆ ప్రక్రియకు మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ లోగా ఊహించని విధంగా ప్రేంసాగర్‌రావుకు రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్ పదవి అప్పగిస్తూ, కేబినెట్ హోదా కల్పించారు. అయితే ఆ పదవిపై పీఎస్సార్ పెద్దగా ఆసక్తి కనబరచడం లేదని తెలుస్తోంది.

ఖర్గే హామీకి భిన్నంగా..

ప్రేంసాగర్‌రావు 2007-13 వరకు ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ పదవిని అలంకరించగా, 2018లో మంచిర్యాల అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు.

అప్పటి నుంచి పీఎస్సార్‌కు మంత్రి పదవి ఖాయమనే ప్రచారం జరిగింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నుంచి కూడా ఈ విషయమై పీఎస్సార్‌కు స్పష్టమైన హామీ ఉందనే అభిప్రాయాలూ వ్యక్తమయ్యాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నస్పూర్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ బహిరంగ సభలో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వస్తే ప్రేం సాగర్‌రావుకు మంత్రి ఇవ్వనున్నట్లు ఖర్గే ప్రకటించారు. అయితే అందుకు భిన్నంగా పీఎస్సార్‌కు పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్ పదవిని అప్పగించారు. దీంతో భవిష్యత్తులోనూ ప్రేంసాగర్ రావు కు మంత్రి పదవి రాదని రేవంత్ ప్రభుత్వం చెప్ప కనే చెప్పినట్లయింది. ఈ అంశంపై నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఎలాంటి కామెంట్లు చేయడం లేదు. ప్రేంసాగర్‌రావు అనారోగ్యం కారణంగా ప్రస్తుతం చెన్నైలోని కోయంబత్తూరులో చికిత్స తీసుకుంటున్నారు. ఈ కారణంగా చైర్మన్ పదవిపై ఆయన నుంచి ఎలాంటి స్పందన లేదు.

దొనబండ హాస్టల్ పరిశీలన

హాజీపూర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : హాజీపూర్ మండలం దొనబండ గ్రామంలోని షెడ్యూల్ కులముల అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహాన్ని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి శుక్రవారం పరిశీలించారు. హాస్టల్‌లో మొ త్తం 68 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందగా, 56 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. విద్యార్థులు మాట్లాడుతూ ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనం సక్రమంగా అం దుతున్నదని, వార్డెన్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉన్నారని వివరించారు. విద్యార్థుల నుంచి సమాచారం సేకరించిన అనంతరం ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని మిట్టపల్లి తిరుపతి సూచించారు. విద్యార్థుల అభ్యాసం, వసతి, ఆహార సదుపాయాలపై యూఎస్ఎఫ్ఐ తరఫున పర్యవేక్షణ కొనసాగుతుందని ఆయన తెలిపారు. అధికారులు కూడా ఎప్పటికప్పుడు హాస్టల్‌పై పర్యవేక్షణ చేపట్టాలని డిమాండ్ చేశారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న మిట్టపల్లి తిరుపతి

దేశ సమగ్రత కోసం కృషి చేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్



మంచిర్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, విద్యార్థులు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : దేశ సమగ్రత కోసం కృషి చేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ఏక్తా దివస్‌ను పురస్కరించుకుని మంచిర్యాల పట్టణంలో కళాశాల విద్యార్థులతో రన్‌ఫర్ యూనిటీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సమగ్రత కోసం పోరాడిన మహనీయుడు వల్లభాయ్‌పటేల్ అని తెలిపారు. నేటి యువత వల్లభాయ్‌పటేల్ జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొయ్యల ఏమాజీ, గాజుల ముకేష్‌గౌడ్, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, జోగుల శ్రీదేవి, అక్కల రమేష్, వైద్య శ్రీధర్, సంతోష్, రాజ్‌కుమార్, రమణరావు, సతీష్ రావు, మల్లేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి


సారంగపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

మందమర్రిరూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లాపంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. శుక్రవారం మండలంలోని సారంగపల్లి, పొన్నారం గ్రామాల్లో పర్యటించారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి రోజు పారిశుధ్య పనులను చేపట్టాలని, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. పంచాయతీ సిబ్బంది చేత ప్లాస్టిక్‌ను సేకరించాలన్నారు. ఈ నెల 15లోగా వంద శాతం పన్నులను వసూలు చేయాలన్నారు. నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని పేర్కొన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గూడెంలో భక్తుల సందడి


సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

దండేపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా మండలంలోని గూడెం సత్యనారాయణ స్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. భక్తులు కుటుంబ సమేతంగా గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, నదిలో కార్తీక దీపాలను వదిలి పెట్టారు. అనంతరం సత్యదేవుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలతో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. వందలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆచరించారు. ప్రధాన ఆలయం ధ్వజస్తంభం, రావిచెట్టు వద్ద భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. దీంతో ఆలయం వద్ద కార్తీక శోభ సంతరించుకుంది.

ఎస్టీపీపీ సీఎంవోఏఐ బ్రాంచ్ ప్రెసిడెంట్‌గా పంతుల

జైపూర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీపీపీలో శుక్రవారం ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం నరసింహారావు ఆధ్వర్యంలో జనరల్‌బాడీ సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీపీపీ సీఎంవోఏఐ బ్రాంచ్ ప్రెసి డెంట్‌గా పంతులను ఏక్రగీవంగా ఎన్నుకున్నారు. అలాగే వైస్‌ప్రెసి డెంట్‌గా జనగామ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా శ్యామలను ఎన్నుకున్నారు ప్రెసిడెంట్ పంతుల మాట్లాడుతూ రాబోయే కాలంలో అందరి సహాయ సహకారాలతో ఉద్యోగుల సమస్యలను, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అధికారులు మదన్ మోహన్, మురళీధర్, అజాజుల్లాఖాన్, కిరణ్‌బాబు, సంతోష్ కుమార్, శ్రీనివాస్, అప్పారావు, మోబిన్, శ్యామల పాల్గొన్నారు.

పంటల పరిశీలన

కోటపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగు రోజులుగా కురి సిన వర్షాలకు నేలకొరిగిన వరి, పత్తి పంటలను శుక్రవారం మండల వ్యవసాయాధికారి సాయికృష్ణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు నేలకొరిగిన వరి పొలాల నుంచి నీటిని పూర్తిగా తొలగించాలని, వరి కొయ్యలను నిటారుగా పైకి లేపి కుచ్చులుగా కట్టుకోవాలని తద్వారా గాలి బాగా ఆడి కోత దశలో ఉన్న వరిపైరుకు ఎటువంటి బ్యాక్టీరియా శిలీంద్రపు జాతి తెగుళ్ల ఆశించకుండా ఉంటాయన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, నష్టపోయిన పంటల పరిస్థితిని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. వరి కోతలను పూర్తిగా ఆరిన తర్వాతనే కోతలు చేయాలన్నారు. రైతులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు న్యాయమూర్తిపై దాడికి నిరసనగా నేడు ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నస్పూర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు న్యాయమూర్తి గవాయిపై జరిగిన దాడికి నిరసనగా నవంబరు ఒకటిన హైదరాబాద్‌లో నిరసన ప్రదర్శన, ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జీ లింగంపల్లి శ్రీనివాస్ తెలిపారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ న్యాయ మూర్తిపై జరిగిన దాడికి నిరసనగా హైదరాబాద్‌లో దళితుల ఆత్మగౌరవ భారీ ప్రదర్శన మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో జరుగుతుందన్నారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించే ర్యాలీ విజయవంతం చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిల్ల మల్లేష్ మాదిగ, జిల్లా ఉపాధ్యాక్షుడు శ్రీనివాస్ ఉన్నారు.

బాధిత రైతులకు పరిహారం చెల్లించాలి

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి


పంటను పరిశీలిస్తున్న రఘునాథ్ వెర్రబెల్లి

హాజీపూర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాన్ ప్రభావంతో హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామంలో నేలకొరిగిన పంటలను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి శుక్రవారం పరిశీలించారు. ఈ సంద ర్భంగా రైతులను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపో యారని రఘునాథ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సర్వే నిర్వహించి, ఎకరానికి వచ్చే పంట దిగుబడి ఆధారంగా కనీస మద్దతు ధర మేరకు రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేయకపోవడం వల్ల పంట నష్టం జరిగినపుడు రైతులకు బీమా లభించడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎనగందుల కృష్ణమూర్తి, మాధవరపు వెంకటరమణరావు, బేతు రవి, అశ్విన్ రెడ్డి, సతీష్, ప్రేమ్‌సాగర్, మారు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి యాజమాన్యం పెద్దపీట

మందమర్రిటౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : సింగరేణిలో కార్మిక క్రీడల కు యాజమాన్యం పెద్దపీట వేస్తుందని, పతకాలు సాధించే క్రీడాకారులకు అండగా ఉంటామని వర్క్‌షాపు డీజీఎం దూప్‌సింగ్ తెలిపారు. శుక్రవారం స్థానిక సింగరేణి పాఠశాల మైదానంలో ఏరియా ఉద్యోగుల వార్షిక క్రీడల్లో భాగంగా నియర్ బై ఇండోర్ కల్చరల్‌పోటీలకు ఆయన హాజరై మాట్లడారు. సింగరేణి ఉద్యోగులకు ప్రతి సంవత్సరం క్రీడలు నిర్వహిస్తామన్నారు. క్రీడాకా రులు ఎంచుకున్న క్రీడల్లో సాధన చేయడం ద్వారా రాణిస్తారన్నారు. కోలిండి యా పోటీల్లో ఉద్యోగులు సత్తా చాటాలన్నారు. యాజమాన్యం క్రీడాకారులకు వసతులు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి భీమనాథుని సుదర్శన్, క్రీడల గౌరవ కార్యదర్శి కార్తీక్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్లు అశోక్, సురేష్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'సామాజిక సేవే లక్ష్యంగా పని చేయాలి..'



మందమర్రిలో 2కే రన్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

మందమర్రిటౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవే లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా మంద మర్రిలో 2కే రన్‌ను నిర్వహించారు. స్థానిక సింగరేణి పాఠశాల మైదానంలో మందమర్రి తహసీల్దార్ సతీష్‌కుమార్, జీఎం రాధాకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రాజలింగులు జెండా ఊపి ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. మున్సిపల్‌కమీషనర్, తహసీల్దార్, జీఎంలు మాట్లాడుతూ పటేల్ జయంతి సందర్భంగా నిర్వహించిన 2కే రన్‌ను ఇంత పెద్ద సంఖ్యలో యువకులు, ప్రజలు రావడం గర్వంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు పోలీసుల విధులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం సీఐని మహిళలు, స్థానికులు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్, ప్రజలు పాల్గొన్నారు.

రామకృష్ణపూర్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం 2కే రన్‌ను నిర్వహించారు. ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని తెలిపారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి

భీమారం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని డీసీపీ భాస్కర్ అన్నారు. ప్రజలకు భద్రత కల్పించడం తో పోలీసుల పాత్ర గొప్పదని పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మి కంగా తనిఖీ చేశారు. రికార్డులను, ఎఫ్ఐఆర్ నమోదు రిజిష్టర్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తిం చాలన్నారు. సంఘ విద్రోహశక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. గుట్కా, గంజాయి, జూదం వంటి వాటి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ఆయన వెంట శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్ఐ లక్ష్మీప్రసన్న, పోలీసులు ఉన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్

డ్రగ్స్ నిర్మూలనకుకు పోరాటం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్‌ను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు నిరంతరం పోరాటం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రజానాట్య మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఎంజాయ్ పేరుతో గంజాయ్ వద్దు అనే నినాదంతో మంచిర్యాలలోని బస్టాండ్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళా కారులు డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను ఆట, పాటల ద్వారా వివరించారు. ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి పట్ల రాష్ట్రవ్యాప్తంగా మరింత అవగాహన క ల్పించేందుకు బస్సుజాతను నిర్వహిస్తున్నామ న్నారు. నాయకులు దాసు, కలీందర్‌ఆలీ ఖాన్, చంద్రశేఖర్, రవి, రామన్న ఉన్నారు.